క్లుప్తంగా

హరితహారం చెట్ల నరికివేత



లచ్చిరెడ్డిగూడం: నరికివేసిన చెట్లు

శివ్వంపేట(నర్సాపూర్): పచ్చదనం పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే కొందరు వ్యక్తులు పచ్చని చెట్లను నరికివేస్తున్నారు. మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడం గ్రామ ప్రధాన రోడ్డుకు ఇరువైపుల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నాలుగేళ్ల క్రితం హరితహారం ద్వారా మొక్కలు నాటి సంరక్షించారు. ఏపుగా పెరిగిన కొన్ని చెట్లను కొందరు వ్యక్తులు మంగళవారం నరికివేశారు. నిబంధనలకు విరుద్ధంగా హరితహారం చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం గురించి ఎంపీఓ తిరుపతిరెడ్డి వివరణ కోరగా.. లచ్చిరెడ్డిగూడంలో హరితహారం చెట్లను నరికివేసిన విషయం తన దృష్టికి రాలేదని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొనసాగుతున్న సర్వే

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. మంగళవారం ఆయా గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారుల ఇళ్ల వివరాలు, ఫొటోలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలందించారు. సర్వేను వేగవంతం చేయాలని, లబ్ధిదారుల ఫొటోలు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

ముగిసిన బంగారమ్మ జాతర



బోనాల ఊరేగింపులో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో కొలువైన బంగారమ్మ జాతర కనుల పండువగా మంగళవారంతో ముగిసింది. చివరి రోజు మంగళవారం ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలతో సంతోషంగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.

యువకుడి మృతి

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మారం గ్రామానికి చెందిన ప్రశాంత్ (22) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ప్రశాంత్‌ను తండ్రి రామస్వామి మందలించడంతో ఈనెల 17న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రశాంత్ అదేరోజు పురుగుల మందు సేవించి ఊరి చివర పడిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి అతన్ని తూప్రాన్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం జీడిమెట్ల వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రశాంత్ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేగోడ్‌కు 108 అంబులెన్స్

రేగోడ్(మెదక్): మండలానికి 108 అంబులెన్స్ మంజూరు అయిందని 108 ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ మంగళవారం తెలిపారు. నూతన వాహనాలు అందుబాటులో ఉన్నాయని, త్వరలో ప్రభుత్వ ఆదేశాలతో నూతన 108 అంబులెన్స్ వాహనాన్ని రేగోడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తామని చెప్పారు.

కాపర్ వైరు ఆయిల్ చోరీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరు, ఆయిల్ చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని గొల్లపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. రైతుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిగుళ్ల నర్సింహులుకు చెందిన పొలం వద్ద 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అయితే మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్ ఉదయం కింద పడి, ఖాళీగా ఉండడాన్ని రైతులు గుర్తించారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. ఏఈ శివశంకర్ ఘటనాస్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు.

రహదారిపై ఒంటెలు



చిన్నశంకరంపేటలో మెదక్ రహదారిపై వెళ్తున్న ఒంటెలు

చిన్నశంకరంపేట(మెదక్): ఎడారిలో ఉండాల్సిన ఒంటే రహదారిపైకి రావడంతో వాటిని చూసేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపారు. మంగళవారం చేగుంట–మెదక్ రహదారిపై వెళ్తూ చిన్నశంకరంపేట మండల కేంద్రంలో కొద్దిసేపు సేద తీరాయి.

క్రిస్మస్ వేడుకలకు వేళాయె

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రార్థనా మందిరాలు సిద్ధమవుతున్నాయి. ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు పాస్టర్‌లు ఏర్పాట్లు పూర్తి చేశారు.



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో విద్యుత్ లైట్ల వెలుగుల్లో చర్చి



నర్సాపూర్: కేక్ కట్ చేస్తున్న అధికారులు, పాస్టర్‌లు సంఘం ప్రతినిధులు





కొడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో క్రిస్మస్‌కు విద్యుత్ కాంతులతో ముస్తాబైన చర్చి



చిలప్‌చెడ్(నర్సాపూర్): ముస్తాబైన చిలప్‌చెడ్ చర్చి



శివ్వంపేట(నర్సాపూర్): మగ్దుంపూర్ ఆశ్రమంలో..

యథేచ్ఛగా కలప అక్రమ వ్యాపారం

- 10 చెట్లకు అనుమతి.. వందల చెట్ల నరికివేత
- మాముళ్ల మత్తులో ఆటవీ శాఖ అధికారులు



వెంకట్‌రావ్‌పేటలో అక్రమంగా తరలిస్తున్న కలప

అల్లాదుర్గం(మెదక్): మండలంలో అక్రమ కలప వ్యాపారం జోరుగా సాగుతోంది. ఆన్‌లైన్‌లో ఎన్ని చెట్లకు ఏ ప్రాంతంలో అనుమతులు తీసుకున్నారో ఎవరికి తెలియదు. ఎక్కడ పడితే అక్కడ చెట్లను నిరికివేస్తూ చాటు మాటున నిల్వ చేసి రాత్రి వేళ అక్రమ రవాణా చేస్తున్నారు. కలప వ్యాపారుల నుంచి ఆటవీశాఖ అధికారులకు పెద్ద ఎత్తున మాముళ్లు ముట్టడంతో, అక్రమ కలపను తరలిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పెద్దశంకరంపేట ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని అల్లాదుర్గం మండల పరిధిలోని రెడ్డిపల్లి, వెంకట్‌రావ్‌పేట గ్రామాల్లో శనివారం, ఆదివారం, రాత్రి వేళల్లో లారీల్లో కలపను తరలిస్తున్నారు. సుబాబుల్, నీలగిరి చెట్లను నరికేందుకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని ఆటవీ అధికారులే చెప్పడం గమనార్హం. సుబాబుల్, నీలగిరి చెట్లు కొట్టాలన్న వాల్టా చట్టం ప్రకారం అధికారుల అనుమతులు తీసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. అక్రమ వ్యాపారులు చేతులు తడుపడంతో అనుమతులు లేకున్నా.. చెట్లను నరుకుతున్నారని, దీంతో గ్రామ శివారులోని ప్రాంతం మైదానంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుబాబుల్, నీలగిరి చెట్ల ముసుగులో వేప, చింత చెట్లతో పాటు వివిధ రకాల చెట్లను నరికివేస్తున్నరని స్థానికులు చెబుతున్నారు. అల్లాదుర్గంలో అక్రమ కలప వ్యాపారంపై కొందరు రేంజ్, సెక్షన్ అధికారులకు ఫిర్యాదు చేస్తే అనుమతులు ఇవ్వమని, చర్యలు తీసుకుంటామని చెబుతున్నారనే విమర్శలున్నాయి. రైతుల పొలాల్లో పంటలపై నీడపడుతుందనే సాకుతో అనుమతులు తీసుకొని అక్రమ వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. అటవీ శాఖ అధికారులు స్పందించి పర్యవరణాన్ని రక్షించేందుకు అక్రమ కలప వ్యాపారం ఆరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా చేపట్టాలి

ఎంపీడీఓ శ్రీనివాస్



కొడిపల్లి(నర్సాపూర్): శేరితండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కొడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా చేయాలని ఎంపీడీఓ శీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని శేరితండా, కొత్త చెరువుతండా, మర్రిచెట్టుతండా పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరిని సర్వే చేయాలన్నారు. అందుబాటులో లేకపోతే సమాచారం ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యజమానులు ముందుకు రావడం అభినందనీయం



కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కాలనీ కమిటీ ప్రతినిధులు

నర్సాపూర్: మురికి కాల్వల నిర్మాణానికి భూముల యజమానులు ముందుకు రావడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 9వ వార్డు పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో మురికి కాల్వల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ పరిధిలోని భూములు, ప్లాట్ల యజమానులు కాలనీలో మురికి కాల్వల నిర్మాణానికి అయ్యే ఖర్చును భరించేందుకు అంగీకరించి కాలనీలో వసతులు కల్పించడం అభినందనీయమని అన్నారు. మున్సిపాలిటీకి నిధులు రాగానే కాలనీలో ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఫ్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లకే శిథిలావస్థకు రైతు వేదిక

తూప్రాన్: రెండేళ్ల క్రితం రైతుల సంక్షేమం కోసం నిర్మించిన రైతు వేదిక శిథిలవస్థకు చేరింది. నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో రైతువేదిక ముందు భాగం, ర్యాంపు, వరండా, తలుపులు కుంగిపోయాయి. నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని కారణంగానే రైతు వేదిక కుంగిపోయిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వాలు నిధులు కేటాయించనప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేని కారణంగానే ప్రభుత్వ నిధులు వృథాగా పోయాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తిరిగి మెరుగైన పనులు చేపట్టాలని కోరుతున్నారు.



తూప్రాన్‌లో కుంగిపోయిన రైతు వేదిక

స్వచ్ఛతకే అధిక ప్రాధాన్యం

కమిషనర్ రమేశ్‌కుమార్



డీఆర్‌సీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రమేశ్

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీలో స్వచ్ఛతకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కల్యాణం రమేశ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని లచ్చపేట శివారులోని డీఆర్‌సీసీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించి తడి, పొడిచెత్త సేకరణ, నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌సీసీ కేంద్రంలో తడి, పొడిచెత్తను వేరుచేసి వాటితో సేంద్రియ ఎరువును తయారుచేసే ప్రక్రియ చేపడుతున్నామన్నారు. వార్డుల్లోని ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడిచెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. పరిసరాలు, భహిరంగ స్థలాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయకుండా స్వచ్ఛ దుబ్బాకకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు అనిల్‌రెడ్డి, దిలీప్ తదితరులు ఉన్నారు.

సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తాం

కార్యకర్తల సమావేశంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు

రామాయంపేట(మెదక్): సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మెదక్ చర్చిని, ఏడుపాయల దేవస్థానాన్ని సందర్శించనున్నారన్నారు. సీఎం సభకు భారీ ఎత్తున ప్రజలను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రామాయంపేటలో రెవెన్యూ డివిజన్ అంశంతో పాటు అసంపూర్తిగా నిలిచిపోయిన కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయడం, ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ నిర్మాణం తదితర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికై కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, నాగులు, మున్సిపల్ కౌన్సిలర్ యాదగిరి, హన్మంతరావు, పార్టీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

భూమి సంరక్షణ పద్ధతులు పాటించాలి



రామాయంపేట రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

రామాయంపేట(మెదక్): రైతులు భూమి సంరక్షణ పద్ధతులు తప్పకుండా పాటించాలని వ్యవసాయ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ సూచించారు. మంగళవారం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంట వ్యర్థాలను కాల్చివేస్తే నష్టం వాటిల్లడంతో పాటు భూసారం దెబ్బతింటుందన్నారు. వ్యర్థాలను భూమిలోనే కుళ్లింపజేస్తే పంటకు మేలు కలుగుతుందన్నారు. నేల సంరక్షణలో బయోచార్ పద్ధతి పాటించాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



పెద్దశంకరంపేట(మెదక్): శివాయిపల్లిలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు

పెద్దశంకరంపేట(మెదక్): యాసంగి పంటల సాగుపై రైతులకు రైతునేస్తం – వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐఏఎస్ డా. గోపి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా.శంకరయ్య అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని శివాయిపల్లి రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో యాసంగి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చలికి పైరు ఎదగకపోవడం, వరినాట్లు, పంట పొలాల్లో నిప్పులు పెట్టడం వల్ల కలిగే నష్టాలతో పాటు ఇతర సమస్యలపై వివరించారు. వ్యవసాయ అధికారులు సూచనలు పాటించి రైతులు అధికదిగుబడి పొందాలని, సహజ ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఓ కృష్ణ, ఏఈఓలు మమత, వినీత్, అఖిల్‌హుస్సేన్ ఉన్నారు.

రావి ఆకుపై ఏసుప్రభు చిత్రం

మనోహరాబాద్(తూప్రాన్): క్రిస్మస్‌ను పురస్కరించుకొని మనోహరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బ్రహ్మాచారి రావి ఆకుపై ఏసుప్రభు రూపాన్ని అద్భుతంగా చిత్రీకరించి క్రిస్టియన్‌లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



ఏసుప్రభు చిత్రం